

వైభవంగా సీతారాముల కల్యాణం



సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

వాల్మీకిపురం: స్థానిక శ్రీ పట్టాభిరామాలయంలో ఆదివారం శ్రీరాముడి జన్మ నక్షత్రమైన పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకొని సీతారాముల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామివారిని సుప్రభాతసేవతో మేల్కొలిపి సేవా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. అనంతరం స్వామి వారికి అర్చన, అభిషేకం, తోమాలసేవ తదితర కార్యక్రమాల అనంతరం విశేష అలంకరణలో ముస్తాబైన ఉత్సవ మూర్తులను మంగళవాయిద్యాల నడుమ ఆలయ ప్రాంగణంలోని ఆస్థాన మండపంలో సాంప్రదాయ బద్ధంగా తీసుకెళ్లి ఆశీనులను చేశారు. అనంతరం వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ శ్రీ సీతారాముల కళ్యాణం వైభవంగా నిర్వహించారు. చివరగా హోమం, పూర్ణాహుతి కార్యక్రమాలతో కల్యాణోత్సవం నిర్వహించారు. స్వామివారి కళ్యాణోత్సవంలో పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి పాల్గొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు సాలిగ్రామ శ్రీనివాసాచార్యులు, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

ఎన్‌ఎంఎంఎస్‌కు దరఖాస్తుకు 15 వరకు గడువు

మదనపల్లె సిటీ: నేషనల్ మీన్స్‌కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్‌ఎంఎంఎస్)కు 15వతేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ శ్రీరామ పురుషోత్తం తెలిపారు. 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇందుకోసం సెప్టెంబర్ 16లోగా పరీక్ష ఫీజు చెల్లించాలని, డిసెంబర్ 3న రెవెన్యూ డివిజన్ కేంద్రాల్లో ఈ పరీక్షను నిర్వహించనున్నట్లు తెలిపారు.









అంగన్‌వాడీల్లో విప్లవాత్మక మార్పులు

మదనపల్లి: చిన్నారులకు పౌష్టికాహారం, ఆటపాటలతో పూర్వ ప్రాథమిక విద్యను అందించాలన్న లక్ష్యంతో ఏర్పాటుచేసిన అంగన్‌వాడీ కేంద్రాలకు మహర్దశ పట్టనుంది. అంగన్‌వాడీ కేంద్రాల రూపురేఖలు మార్చేందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించి మాతా శిశు సంరక్షణలో భాగంగా విప్లవాత్మక మార్పులతో బలోపేతం దిశగా చర్యలు తీసుకుంటున్నారు. నాడు–నేడు పథకాన్ని అంగన్‌వాడీ కేంద్రాలకు వర్తింపజేస్తూ.. అద్దె భవనాల్లో కొనసాగుతున్న కేంద్రాలకు కొత్త భవనాలను నిర్మించనున్నారు. పాత కేంద్రాల్లో మరమ్మతులు చేసి ఆధునిక వసతులు కల్పిస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పూర్వప్రాథమిక విద్యను అమల్లోకి తీసుకురానున్న నేపథ్యంలో వైఎస్సార్ ప్రీ ప్రైమరీ పాఠశాలలుగా మార్పుచేశారు. గర్భిణులు, బాలింతలతో పాటు చిన్నారులకు క్రమం తప్పకుండా పౌష్టికాహారం పంపిణీ చేస్తున్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో కార్పొరేట్ సౌకర్యాలు

గోడలపై రంగురంగుల అందమైన చిత్రాలు...ఆకట్టుకునే ఆటబొమ్మలతో అంగన్‌వాడీ కేంద్రాలు ప్లేస్కూళ్లను తలపిస్తున్నాయి. ప్రైవేట్, కార్పొరేట్ ప్లే స్కూళ్లలో నర్సరీ, ప్రీ ప్రైమరీ విద్యార్థులకు కల్పించే సౌకర్యాలన్నీ అంగన్‌వాడీ కేంద్రాల్లో సమకూర్చడం జరుగుతోంది.

అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతం :

ఒకప్పుడు పాత ఇండ్లు, అద్దె గదుల్లో నిధులు లేక అరకొర వసతులతో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ సెంటర్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టితో బలోపేతం దిశగా చర్యలు తీసుకోవడంతో పక్కా భవనాల నిర్మాణాలు జరుపుకుంటున్నాయి.ఎంపిక చేసిన కేంద్రాలను మోడల్ సెంటర్లుగా తీర్చిదిద్దడంతో పాటు గోడలపై రంగురంగుల కార్టూన్లు, అక్షరాలు, పదాలు, నేర్చుకునేందుకు అర్థమయ్యే రీతిలో చిత్రాలను వేశారు. ఆటవస్తువులు, టెలివిజన్, బోధనాసామగ్రిని సమకూర్చారు. మరుగుదొడ్లు, ప్రహరీ, తాగునీరు, కుర్చీలు వంటి అన్ని సౌకర్యాలు కల్పించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రాకముందు, అంటే గత ఎన్నికలకు ఆరునెలల ముందు వరకూ అంగన్‌వాడీ వర్కర్ల జీతం నెలకు రూ.7వేలు, హెల్పర్లకు రూ.4,500 మాత్రమే. వైఎస్.జగన్ ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టిన మూడువారాల్లోనే వారికి జీతాలు పెంచుతూ ప్రభుత్వం జీఓఎంఎస్ నంబర్ 18 జారీచేసింది. అంగన్‌వాడీ వర్కర్ల జీతాలు నెలకు రూ.11,500కు, హెల్పర్లకు రూ.7వేలకు పెంచుతూ 2019 జూన్ 26న ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. విధి నిర్వహణలో మంచి పనితీరు కనబర్చిన అంగన్‌వాడీ వర్కర్లకు, హెల్పర్లకు ప్రోత్సాహకంగా నెలకు రూ.500 చొప్పున ప్రభుత్వం అదనంగా అందిస్తోంది.



అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు నేర్పిస్తున్న ప్రీ స్కూల్ యాక్టివిటీస్









వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

రాయచోటి అర్బన్ : దాతలు, స్వచ్ఛంద సేవా సంస్థలు వారు ఉచితంగా నిర్వహింపచేసే వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని దివాన్ సాహెబ్ దర్గా ఎదురుగా జిన్నా సేవా సంస్థ ఆధ్వర్యంలో తిరుపతి సంకల్ప ఆసుపత్రి సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరంలో ఆయన మున్సిపల్ చైర్మన్ ఫయాజ్‌బాషాతో కలసి పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ దాతలు ఎంతో సదుద్దేశంతో ఏర్పాటు చేసే ఉచిత వైద్యశిబిరాలను పేదలు, రోగులు సద్వినియోగం చేసుకోవడం ద్వారా లబ్ధి పొందాలన్నారు. రోగుల సౌకర్యార్థం జిన్నా సేవా సంస్థ స్పెషలిస్టు డాక్టర్లచే ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహింపచేయడం అభినందనీయమన్నారు. శిబిరంలో గుండె వైద్య నిపుణులు నాగరాజ్ కుమార్, ఫిజిషియన్ అండ్ డయాబెటాలజిస్టు రాజశేఖరరెడ్డి, యూరాలజిస్ట్ అండ్ ఆండ్రాలజిస్ట్ వినయ్ భరద్వాజ్, ప్రసూతి వైద్యురాలు వాణిరెడ్డి, న్యూరో సర్జన్ డాక్టర్ సుదర్శన్, ఫిజియోథెరపిస్టు డాక్టర్ రహంతుల్లా తదితరులు పాల్గొని రోగులకు వైద్యసేవలందించారు. ఉచితంగా మందులను అందజేశారు. కార్యక్రమంలో వైఎస్ఆర్‌సీపీ మైనార్టీ నేతలు బేపారి మహమ్మద్‌ఖాన్, ఆసిఫ్‌అలీఖాన్, రియాజుర్ రహిమాన్, ఫయాజ్ అహమ్మద్, రియాజ్, ఆర్ట్స్ శంకర్, కొత్తపల్లె ఇంతియాజ్, సంకల్ప ఆసుపత్రి పీఆర్‌ఓ వలీ పాల్గొన్నారు.



శిబిరంలో రోగుల సమస్యలు తెలుసుకుంటున్న శ్రీకాంత్‌రెడ్డి

మహిమాన్వితుడు కేవలానంద లక్ష్మీనారాయణ స్వామి

రామాపురం : కేవలానంద లక్ష్మీనారాయణ స్వామి మహిమాన్వితుడు అని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. మండలంలోని నల్లగుట్టపల్లె గ్రామం బి.రాచపల్లెలో మల్‌రెడ్డి రాజారెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన కేవలానంద లక్ష్మీనారాయణస్వామి విగ్రహ ప్రతిష్ట తొలి పూజలో ఆయన పాల్గొన్నారు. ఆలయ పూజారులు తీర్థ ప్రసాదాలు అందించి ఆశీర్వదించారు. ఆయనతోపాటు సర్పంచ్ నాగభూషన్‌రెడ్డి, వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ ఆంజనేయులు, సత్యయాదవ్, మల్‌రెడ్డి శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

సంతాపం

రామాపురం మండలంలోని నల్లగుట్టపల్లె పంచాయతీ బీసీ కాలనీకి చెందిన గంపా నాగభూషన్ అనారోగ్యంతో మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి ఆదివారం గంపా నాగభూషన్ భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి, తోడుగా ఉంటామని హామీ ఇచ్చారు. ఆయనతో పాటు సర్పంచ్ నాగభూషన్‌రెడ్డి, యువజన విభాగపు రాష్ట్ర కార్యదర్శి సూరం వెంకటసుబ్బారెడ్డి, వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ ఆంజనేయులు, సత్యాయాదవ్ తదితరులు నివాళులు అర్పించారు.

కార్యకర్త శంకర్‌రెడ్డి భౌతికకాయానికి నివాళులర్పించిన ఎమ్మెల్యే

సంబేపల్లె : వైఎస్ఆర్‌సీపీ కార్యకర్త శంకర్‌రెడ్డి భౌతికకాయానికి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి ఆదివారం నివాళులర్పించారు. మండల పరిధిలోని గున్నికుంట్ల గ్రామం కత్తివాండ్లపల్లె చెందిన శంకర్‌రెడ్డి శనివారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. విషయం తెలుకొన్న ఎమ్మెల్యే మృతి స్వగ్రామానికి వెళ్లి మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఎమ్మెల్యే వెంట సర్పంచ్ నాగభూషన్‌రెడ్డి, శివారెడ్డి, శేఖర్‌రెడ్డి, కొండారెడ్డి, జనార్దన్‌రెడ్డిలు ఉన్నారు.



పేద మహిళలకు చీరల పంపిణీ

పెనగలూరు : వైఎస్సార్ సీపీ కో–కన్వీనర్ గోవిందు నాగరాజు ఆధ్వర్యంలో ఆదివారం చక్రంపేట జిల్లా పరిషత్ హైస్కూల్‌లో జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆకేపాటి మాట్లాడుతూ ఎంపీ మిథున్ రెడ్డిపై ఉన్న ప్రేమాభిమానాలతో కువైట్, గల్ఫ్ వైఎస్సార్‌సీపీ నాయకులు చక్రంపేటకు వచ్చి చీరలు పంపిణీ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం ఎంతో గొప్పవిషయమన్నారు. అంతకు ముందు కేక్‌ను కట్ చేసి మహిళలందరికీ పంచిపెట్టారు. అనంతరం గోవిందునాగరాజు మాట్లాడుతూ ఎంపీ మిథున్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా గతంలో కూడా ఇక్కడ భారీ మెడికల్ క్యాంపు నిర్వహించి పేద ప్రజలకు సేవ చేయడం తనకెంతో సంతోషంగా ఉందన్నారు. అలాగే ఎంపీ పుట్టినరోజును పురస్కరించుకొని పేద మహిళలకు చీరలు పంపిణీ చేయడం తనకెంతో ఆనందాన్ని ఇచ్చిందన్నారు. కార్యక్రమంలో గల్ఫ్ కన్వీనర్ ఇంతియాజ్, కువైట్ వైఎస్సార్‌సీపీ కన్వీనర్ బాలిరెడ్డి, కువైట్ కో–కన్వీనర్ ఎంవీ నరసారెడ్డి, యూత్ సభ్యులు సత్తార్, రహ్మతుల్లా, హరినాయుడు, జెడ్పీటీసీ సుబ్బరాయుడు, ముస్లిం మైనార్టీ నాయకుడు ఇంతియాజ్, హైస్కూల్ చైర్మన్ రమేష్ రెడ్డి, సర్పంచ్ రాజకుమార్, కువైట్ వైఎస్సార్‌సీపీ గౌరవ సలహాదారు నాగిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, సర్పంచ్ ఈశ్వరయ్య, మాజీ సర్పంచ్‌లు ధనుంజయరెడ్డి, ఆంజనేయులు రెడ్డిలతోపాటు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

కువైట్‌లో విస్తృతంగా సేవలు

వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో కువైట్, గల్ఫ్ దేశాలలో విస్తృతంగా సేవ కార్యక్రమాలు చేస్తున్నామని కువైట్ వైఎస్సార్‌సీపీ కన్వీనర్ బాలిరెడ్డి తెలిపారు. ఆదివారం కువైట్, గల్ఫ్ నుంచి వచ్చిన వైఎస్సార్‌సీపీ నాయకులతో ప్రత్యేకంగా విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని స్ఫూర్తిగా తీసుకొని కువైట్‌లో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో సేవ కార్యక్రమాలు చేస్తూ ముందుకు సాగుతున్నామన్నారు. కువైట్‌లో పార్టీ స్థాపించినప్పటి నుంచి ఇండియా వారు ఎవరైనా కువైట్‌లో ఇబ్బందులు పడుతుంటే వారికి సహాయం చేస్తూ ఆదుకుంటున్నామన్నారు. అలాగే ఎక్కడైనా ప్రమాదాలు జరిగినా, ఇతర ఏ సమస్యలతోనైనా ఇబ్బందులు పడుతుంటే అటువంటి వారందరికీ కువైట్, గల్ఫ్ వైఎస్సార్‌సీపీ ఒక కమిటీగా ఏర్పడి వారందరికీ సేవలు అందిస్తున్నామని తెలియజేశారు.



క్రీడలు, వ్యాయామం అందరికి తప్పనిసరి

గాలివీడు : క్రీడల పట్ల క్రీడాకారుల్లో నాయకత్వ, ఐక్యమత్యం, పోరాటే స్ఫూర్తి, స్నేహభావం వంటి సుగుణాలు అలవాటుపడతారని ఎంపీపీ మిట్టపల్లె యదుభూషన్‌రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆవుల నాగభూషన్‌రెడ్డిలు పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని గోరాన్‌చెరువు గ్రామం వడివలవంకలో క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. మాట్లా డుతూ ఆరోగ్యవంతమైన జీవనానికి, క్రమశిక్షణకు క్రీడలు ఎంతగానో దోహదం చేస్తాయన్నారు. అంతేగాక క్రీడలతో శారీరక, మానసిక దృఢత్వం పొందవచ్చునన్నారు. ప్రతి ఒక్కరూ క్రీడలు, వ్యాయామం నిత్యజీవితంలో తప్పనిసరి చేసుకోవాలన్నారు. వైస్ ఎంపీపీ–2 శ్రీనివాసులు, సర్పంచ్‌లు ఉమాపతిరెడ్డి, హరీష్‌కుమార్‌రెడ్డి, ఉప సర్పంచ్ తంగాల వెంకటరత్నం, వైఎస్సార్‌సీపీ నాయకులు కసిరెడ్డి శివారెడ్డి, బ్రహ్మానందరెడ్డి, వెంకటాద్రి, మాజీ ఎంపీటీసీ చిన్నరెడ్డి, మైనార్టీ యువ నాయకులు నిజాముద్దీన్, రమణారెడ్డి, సుబ్బారెడ్డి, అమీన్ పాల్గొన్నారు.

సోమశిల ముంపు ప్రాంతీయులకు పక్కా ఇళ్లు

– ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి

రాజంపేట : రాజంపేట మండలం పోలి గ్రామ పరిధిలో ఉన్న స్థలాలలో సోమశిల ముంపు ప్రాంతీయులకు పక్కా ఇళ్లు మంజూరు చేసే అంశాన్ని రాజంపేట లోక్‌సభ సభ్యుడు పీవీ మిథున్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లనున్నట్లు శాసనసభ్యుడు మేడా మల్లికార్జునరెడ్డి అన్నారు. ఆదివారం మేడా భవన్‌లో సోమశిల మునక ప్రాంతాలైన చుక్కాయపల్లె, చాపరవారిపల్లె తదితర గ్రామాలకు చెందిన ముంపు బాధితులు ఎమ్మెల్యేను కలిసి పోలి వద్ద తమకు ఇంటిస్థలాలు, పక్కా ఇళ్లు నిర్మితం చేయించాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణ సమస్యను ఎంపీతోపాటు జిల్లా కలెక్టరు, ఆర్డీఓల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే దిశగా ప్రయత్నం చేస్తానన్నారు. సోమశిల ముంపు బాధితులు వీలైనంత న్యాయం చేసేందుకు తాను ఎల్లప్పుడూ ముందుంటానన్నారు. కార్యక్రమంలో రాజంపేట మున్సిపాలిటీ కో–ఆప్షన్ సభ్యుడు రాముయాదవ్, కౌన్సిలర్లు పసుపులేటి సుధాకర్, కూండ్ల రమణారెడ్డి, పెద్దాసుపత్రి డైరక్టరు ఉమామహేశ్వరరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు పాలగిరి మల్లికార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.







క్లుప్తంగా

12న మండల స్థాయి క్రీడాపోటీలు

నిమ్మనపల్లె : మండల స్థాయి పాఠశాలల క్రీడా పోటీలను ఈనెల 12 నుంచి నిర్వహిస్తున్నట్లు జెడ్పీహైస్కూ ల్(తెలుగు) ప్రధానోపాధ్యాయుడు అంజాద్అలీఖాన్, మండల పాఠశాలల క్రీడల కోఆర్డినేటర్ ఎం.భద్రయ్య తెలిపారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ... మంగళవారం నిమ్మనపల్లె జెడ్పీ హైస్కూ ల్(తెలుగు) క్రీడా మైదానంలో పాఠశాలల క్రీడల(స్కూల్గేమ్స్) వారి ఆధ్వర్యంలో 14–17 సంవత్సరాల్లోపు బాలబాలికలకు ఖోఖో, బ్యాడ్మింటన్, బాల్ బాడ్మింటన్, యోగ, అథ్లెటిక్ తదితర క్రీడల్లో పోటీలు నిర్వహించి విద్యార్థులను ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. మండలంలోని పాఠశాలల్లో ఆసక్తి కలిగిన విద్యార్థులు క్రీడల్లో పాల్గొనాలని తెలిపారు.

నేడు కందుకూరు పంచాయతీలో పల్లెబాట

పెద్దతిప్పసముద్రం: మండలంలోని కందుకూరు పంచాయతీలో సోమవారం పల్లెబాట కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీపీ మహమూద్, జేసీఎస్ కన్వీనర్ డ్రిప్ రమణ తెలిపారు. అగ్రహారం నుంచి ప్రారంభం అయ్యే ఈ పల్లెబాటకు అన్ని శాఖల మండల స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరు కావాలని వారు కోరారు.

వివాహ వేడుకల్లో రిటర్న్‌గిఫ్ట్



రోజా మొక్కను అందజేస్తున్న నూతన వధూవరులు

మదనపల్లె సిటీ: పెళ్లి వేడుకల్లో వధూవరులకు బహుమతులు ఇవ్వడం ఆనవాయితీ. అయితే వివాహానికి వచ్చినవారికి మొక్కలు అందించిన సంఘటన మదనపల్లె పట్టణం సుబ్రమణ్యస్వామి ఆలయంలో ఆదివారం జరిగింది. మదనపల్లెకు చెందిన సందీప్, శైలజల వివాహానికి బంధుమిత్రులు హాజరయ్యారు. వివాహానికి హాజరైనవారందరికి హెల్పింగ్ మైండ్స్ వ్యవస్థాపకులు అబూబకర్‌సిద్దిక్, నూతన, వధూవరులు మొక్కలు అందించి అందరి మన్నలు పొందారు. కార్యక్రమంలో హెల్పింగ్‌మైండ్స్ సభ్యులు హనీఫ్, పురుషోత్తం, అర్షద్, అమీన్ తదితరులు పాల్గొన్నారు.

గర్నిమిట్ట యల్లమ్మకు బోణాలు



బోణాలు ఊరేగింపుగా తెస్తున్న భక్తులు

కేవీపల్లె : మండలంలోని గర్నిమిట్టలో వెలసిన శ్రీ యల్లమ్మతల్లికి ఆదివారం భక్తులు బోణాలు సమర్పించారు. ఆదివారం ఉదయం అమ్మవారికి అభిషేకం, వివిధ రకాల పుష్పాలతో అలంకరణ, ప్రత్యేకపూజలు, మంగళహారతి, తీర్థ ప్రసాద వినియోగం చేపట్టారు. గర్నిమిట్ట పరిసర గ్రామాలకు చెందిన భక్తులు మంగళవాయిద్యాలతో బోణాలు ఊరేగింపుగా తీసుకొచ్చి ఆలయ ప్రదక్షిణలు నిర్వహించారు. అమ్మవారికి బోణాలు సమర్పించి మొక్కులు చెల్లించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు.

నేడు రక్తదాన శిబిరం

పీలేరు : రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని సోమవారం ఉదయం 10 గంటలకు స్థానిక ప్రభుత్వాస్పత్రి ఆవరణలో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు ఏపీ టూరిజం కౌన్సిల్ మెంబర్ షాకీర్ తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, రక్త దాతలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

లారీ ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలు

– పరిస్థితి విషమం



తీవ్రంగా గాయపడిన నారాయణరెడ్డి

మదనపల్లె : లారీ ఢీకొని ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడి పరిస్థితి విషమించిన సంఘటన శనివారం రాత్రి బి.కొత్తకోట మండలంలో జరిగింది. కోటావూరు పంచాయతీ ఎగువసిద్దివారిపల్లెకు చెందిన నారాయణరెడ్డి(56) వ్యవసాయం చేస్తూ జీవిస్తున్నాడు. శనివారం తన ద్విచక్రవాహనంలో ఇంటివద్ద నుంచి బయలుదేరి కాండ్లమడుగు క్రాస్‌కు వచ్చి పెట్రోల్ నింపుకుని తిరిగి వెళుతుండగా, ఎదురుగా వచ్చిన లారీ ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ప్రమాదంలో నారాయణరెడ్డి తీవ్రంగా గాయపడగా స్థానికులు 108 అంబులెన్స్ వాహనంలో మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్సల అనంతరం పరిస్థితి విషమంగా ఉండటంతో బాధితుడ్ని మెరుగైన వైద్యంకోసం తిరుపతి రెఫర్ చేశారు. బి.కొత్తకోట పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గ్రామీణ రోడ్లకు మహర్దశ

- ఎగువదొనబైలు, కొండమీద తండా గ్రామాలకు రోడ్డు
- స్వాతంత్య్రం వచ్చిన 77 ఏళ్లకు తారురోడ్డు సౌకర్యం
- ఎన్నికల హామీని నిలుపుకున్న ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే నవాజ్‌బాషా
- రోడ్డు పనులను ప్రారంభించిన జెడ్పీటీసీ ఉదయ్‌కుమార్
- వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో కల నెరవేరడంపై గ్రామస్తుల హర్షం



ఎగువదొనబైలుకు రోడ్డుపనులను ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ ఉదయ్‌కుమార్, గ్రామస్తులు

మదనపల్లె : మండలంలోని చీకలబైలు పంచాయతీలోని ఎగువ దొనబైలు, వేంపల్లె పంచాయతీ కొండమీది తండా గ్రామాలకు స్వాతంత్య్రం వచ్చిన 77 ఏళ్లకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో తొలిసారిగా తారు రోడ్డు సౌకర్యం కలిగింది. ఇన్నాళ్లు మండలంలో ఎత్తైన కొండప్రాంతంలో, రవాణాసౌకర్యాలకు దూరంగా, రాళ్లు, రప్పలతో, ఎగుడుదిగుడుగా రోడ్డు లేని గ్రామాలుగా పేరుపొందిన ఈ రెండు పల్లెలకు రోడ్డు సౌకర్యం ఏర్పాటవుతుండటంతో ఆనందానికి అవధులు లేవు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే నవాజ్‌బాషాలు గ్రామానికి సరైన రోడ్డు లేకపోవడం, గ్రామస్తుల అవస్థలను గమనించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే తప్పక రోడ్డు సౌకర్యం కల్పిస్తానని హామీ ఇచ్చారు. చెప్పినట్లుగానే హామీ నిలుపుకునే క్రమంలో చీకలబైలు గ్రామం నుంచి ఎగువ దొనబైలు గ్రామానికి 5 కిలోమీటర్ల మేర రోడ్డు వేసేందుకు రూ.3.60కోట్లు, గుట్టకిందపల్లె నుంచి మూడుకిలోమీటర్ల దూరంలోని కొండమీద తండా గ్రామానికి రూ.2.41 కోట్లు నిధులు విడుదల చేశారు. ఆదివారం తారురోడ్డు పనులను జెడ్పీటీసీ ఉదయ్‌కుమార్ స్థానికులతో కలిసి పూజా కార్యక్రమాలతో లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...మదనపల్లెకు 12 కిలోమీటర్ల దూరంలో ఉన్నటువంటి ఎగువదొనబైలు గ్రామానికి చేరుకోవాలంటే గ్రామస్తులు కాలినడకన కొండలు, గుట్టలు, రాళ్లు, చెట్లు మధ్యన నివాసప్రాంతాలకు వెళ్లాల్సి ఉండేదన్నారు. కేవలం ద్విచక్రవాహనాలు, ట్రాక్టర్‌లు వెళ్లేట్లుగా ఉన్నటువంటి కొద్దిపాటి మట్టిరోడ్డును పూర్తిస్థాయిలో వెడల్పుచేసి తారురోడ్డు వేయాల్సిందిగా గ్రామస్తులు కొన్నేళ్లుగా ప్రజాప్రతినిధులకు, అధికారులకు వినతులు చేసినా ప్రయోజనం లేకపోయిందన్నారు. విద్యార్థులు పాఠశాలలకు వెళ్లేందుకు, రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులు తరలించేందుకు, అనారోగ్య సమస్యలతో గ్రామస్తులు ఆస్పత్రికి వెళ్లాలన్నా అగచాట్లు పడాల్సి వచ్చేదన్నారు. గ్రామస్తుల విన్నపం మేరకు రాష్ట్ర అటవీ, విద్యుత్, శాస్త్ర, సాంకేతిక, పర్యావరణ, భూగర్భగనులశాఖ మంత్రి పెద్దిరెడ్డిరామచంద్రారెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే నవాజ్‌బాషాలు స్పందించి రెండు గ్రామాలకు రోడ్డు వసతి కల్పించారన్నారు. మదనపల్లె నియోజకవర్గంలో ఎంపీ మిథున్‌రెడ్డి సహకారంతో రూ.50 కోట్లతో రోడ్లను అభివృద్ధి చేస్తుంటే.. అందులో రూ.40కోట్లు మదనపల్లె మండలంలో ఖర్చుచేస్తున్నట్లు తెలిపారు. 77 ఏళ్ల తర్వాత తమ గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించి తమ వెతలు తీర్చినందుకు ఎగువదొనబైలు, కొండమీది తండా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే నవాజ్‌బాషా, వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పారాసి ఆదెమ్మ, ఎంపీటీసీ సుభాషిణి, జగదీష్, గ్రామస్తులు మోహన, లోకేశ్వరరెడ్డి, వెంకటరమణ, నారాయణ, జయనారాయణరెడ్డి, సాయిశేఖర్‌రెడ్డి, వెంకటరమణ పాల్గొన్నారు.

వరాల తల్లీ.. కరుణించమ్మా



సంతానం కోసం వరపడిన మహిళలు

గుర్రంకొండ: వరాలతల్లీ కరుణించమ్మా.. అంటూ భక్తులు మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో వెలసిన రెడ్డెమ్మతల్లి ఆలయంలో అమ్మవారిని మొక్కుకొన్నారు. ఆదివారం ఆలయంలో అమ్మవారికి విశేష పూజలు,అభిషేకాలు నిర్వహించారు. సంతనాన్ని ప్రసాదించే చల్లని తల్లిగా ప్రసిద్ధిపొందిన అమ్మవారి ఆలయానికి వేకువజాము నుంచే భక్తుల సందడి మొదలైంది. మహిళలు అమ్మవారి కోనేట్లో పవిత్ర స్నానమాచరించి సంతాన కోసం వరపడ్డారు. మొక్కులు తీరిన భక్తులు అమ్మవారికి బంగారు, వెండి, చీరెసారెలతో మొక్కులు చెల్లించుకొన్నారు. పలువురు అమ్మవారికి భక్తిశ్రద్ధలతో తలనీలాలు సమర్పించారు. ఆలయ మెట్లకు పసుపు కుంకుమ, కర్పూర హారతులతో పూజలు చేశారు. ఆలయంలో పలువురు అన్నదానం నిర్వహించారు. రాయలసీమ జిల్లాలతోపాటు తమిళనాడు, కర్ణాటకా రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు అమ్మవారి ఆలయానికి తరలిరావడం విశేషం.

బాధితులకు ఎమ్మెల్యే పరామర్శ



కోనేటివీధిలో శ్రీకాంను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే చింతల

వాల్మీకిపురం: ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన బాధితులను పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి పరామర్శించారు. ఆదివారం పట్టణంలోని కోనేటివీధికి చెందిన గోనవరపు శీనాస్వామి కుమారుడు శ్రీకాం, ఇందిరమ్మ కాలనీకి చెందిన ఏఎస్ఐ లీలావతిని వారి వారి ఇంటికి వెళ్లి పరామర్శించి, సానుభూతి తెలిపారు. రోడ్డు ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే చింతల వెంట చింతల ఆనంద రెడ్డి, కేశవ రెడ్డి, క్రిష్ణమూర్తి ఉన్నారు.

ఆత్మహత్యలు సమస్యలకు పరిష్కారం కాదు



మాట్లాడుతున్న జేవీవీ జిల్లా అధ్యక్షుడు ప్రభుచరణ్

వాల్మీకిపురం: ఆత్మహత్యలు సమస్యలకు పరిష్కారం కాదని జనవిజ్ఞాన వేదిక నాయకులు పేర్కొన్నారు. ఆదివారం అంతర్జాతీయ ఆత్మహత్యల నివారణ దినోత్సవం సందర్భంగా జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో స్థానిక తరిగొండ రోడ్డులోని మైనార్టీ బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థినులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జేవీవీ జిల్లా అధ్యక్షుడు ప్రభుచరణ్ మాట్లాడుతూ భారతదేశంలో ప్రతి ఏటా రెండు లక్షల మంది, ప్రపంచ వ్యాప్తంగా ప్రతి ఏటా పది లక్షల మంది ఆత్మహత్య చేసుకుంటున్నారన్నారు. 15–19 ఏళ్ల మధ్య ఉన్న యువతలో మరణానికి ప్రధాన కారణం ఆత్మహత్య అని తెలిపారు. ఎవరితో మాట్లాడకుండా ఉండటం, ఫోన్లు తీయకపోవడం, డిప్రెషన్‌లో ఉండటం తమను తాము ఇతరులపై భారంగా భావించడం ఒంటరిగా గడపడం వంటి వాటిని మనం హెచ్చరికలుగా భావించాలన్నారు. చావు ఒక్కటే అన్ని సమస్యలకు పరిష్కారం కాదని, ఏ సమస్య ఎదురైనా బతికే సాధించాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ నవమల్లిక, ఉపాధ్యాయులు రమీజా, విద్యార్థులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీకి ప్రభుత్వ స్థలం అప్పగింతకు సర్వే

– పొలానికి దారి వదిలి సర్వే చేయాలంటూ అడ్డుకున్న రైతు



సర్వేయర్ సుబ్రహ్మణ్యంతో పొలానికి దారి వదలాలంటూ వాగ్వాదం చేస్తున్న రైతు

మదనపల్లె : జిల్లా కలెక్టర్ పీఎస్.గిరీషా ఆదేశాల మేరకు మదనపల్లె మండలం బసినికొండ రెవెన్యూ గ్రామం, కొండామర్రిపల్లె పంచాయతీ సర్వేనెంబర్.235లోని ప్రభుత్వ స్థలాన్ని మున్సిపాలిటీకి అప్పగించేందుకు ఆదివారం రెవెన్యూ అధికారులు సర్వే నిర్వహించారు. మండల సర్వేయర్ సుబ్రహ్మణ్యం, మున్సిపల్ సర్వేయర్ పూర్ణచంద్రలు, ఆర్ఐ సుప్రజ సమక్షంలో వార్డు సర్వేయర్లతో కలిసి సర్వే చేసేందుకు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో ప్రభుత్వ స్థలానికి ఆనుకుని పట్టాభూమి కలిగిన దేవిరెడ్డిగారిపల్లెకు చెందిన రైతు భాస్కర్ పనులను అడ్డుకున్నారు. రెవెన్యూ అధికారులు ప్రభుత్వస్థలాన్ని సర్వే చేసే క్రమంలో తన పట్టాభూమిలో ట్రెంచ్ తవ్వేశారని ఆరోపించారు. ప్రభుత్వస్థలం తన పట్టాభూమికి మధ్యలో ఉండటంతో పొలంలోకి వెళ్లేందుకు పూర్వీకుల నుంచి దారికి కొంతమేర వినియోగిస్తున్నామని, దాన్ని వదలి సర్వే నిర్వహించి స్వాధీనం చేసుకోవాల్సిందిగా కోరారు. దీనిపై సర్వేయర్ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ.. సర్వేనెంబర్.235లో 6.15 ఎకరాల ప్రభుత్వస్థలం ఉందని, ఇందులో 40 సెంట్లు నేషనల్ హైవేకు పోగా, 2.05 సెంట్లు రామాపురం వెంకటమ్మ పేరుతో డీకేటీ పట్టా ఉందన్నారు. మిగిలిన ప్రభుత్వస్థలాన్ని పూర్తిగా స్వాధీనం చేసుకోవాల్సిందిగా తమకు ఆదేశాలు ఉన్నాయని, అభ్యంతరాలు ఉంటే ఉన్నతాధికారులకు తెలపాలని, పనులను అడ్డుకోవద్దన్నారు. ఈ క్రమంలో ఇరువురికి మధ్య కొంతసేపు వాగ్వాదం జరిగింది. చుట్టుపక్కల రైతులు పొలానికి వెళ్లేందుకు దారి వదలాలని అధికారులను కోరారు. దీంతో అర్జీ పెట్టుకుంటే మార్కెట్‌ధర ప్రకారం ఇస్తామని రెవెన్యూ అధికారులు చెప్పడంతో ఎట్టకేలకు సమస్య పరిష్కారం అయింది. తర్వాత ప్రభుత్వస్థలం చుట్టూ జేసీబీతో ట్రెంచ్ ఏర్పాటు పనులు నిర్వహించారు.

19వ వార్డులో మురుగు కాలువల నిర్మాణం



పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ వైస్‌చైర్మన్

మదనపల్లె : పట్టణంలోని 19వవార్డులో రూ.30 లక్షలతో మురుగు కాలువల నిర్మాణ పనులు చేపట్టినట్లు మున్సిపల్ వైస్‌చైర్మన్ నూర్‌ఆజం, కౌన్సిలర్ బి.ఎ.ఖాజా తెలిపారు. ఆదివారం 19వవార్డులోని పోతులప్పవీధి, చంద్రా పాలడెయిరీ వీధి, అవంతి థియేటర్ లైన్ తదితర ప్రాంతాల్లో జరుగుతున్న మురుగుకాలువ నిర్మాణపనులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... సుమారు 35 ఏళ్ల తర్వాత తొలిసారిగా పాత కాలువల స్థానంలో వెడల్పైన పెద్ద కాలువల నిర్మాణాన్ని వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. పనులు వేగవంతంగా చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు రహీం, వార్డు సచివాలయాల కన్వీనర్లు అష్రఫ్, ఉమర్‌సాహెబ్, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

ఘనంగా యల్లమ్మతల్లి విగ్రహ ప్రతిష్ట



యల్లమ్మతల్లి విగ్రహ ప్రతిష్టలో భక్తులు

పీలేరు రూరల్ : స్థానిక మోడల్ కాలనీలో నూతనంగా నిర్మించిన యల్లమ్మతల్లి దేవస్థానములో ఆదివారం విగ్రహ ప్రతిష్ట ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఉదయం ఆలయంలో యాగపూజ, గణపతిహోమం, దుర్గాహోమం, లక్ష్మీహోమం, సర్వశాంతిహోమం, ప్రాణప్రతిష్ట, మహాకుంభాభిషేకం, అభిషేకం నిర్వహించారు. అమ్మవారికి విశేష అలంకరణతో భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు భక్తులు పాల్గొన్నారు.

ఆర్టీసీలో శ్రీశైలం దర్శన టిక్కెట్లు

మదనపల్లె సిటీ: ఆర్టీసీ బస్సు టిక్కెట్టుతో పాటు శ్రీశైలం దర్శన టిక్కెట్లు కూడా డిపో రిజర్వేషన్ కౌంటర్‌లో జారీ చేయనున్నట్లు ఆర్టీసీ–2 డిపో మేనేజర్ ఆర్‌సీ నిరంజన్ తెలిపారు. మదనపల్లె డిపో నుంచి ప్రతి రోజు 3.40 గంటలకు బయలుదేరుతుందన్నారు. స్పర్శ దర్శనం రూ.500, అతి శీఘ్రదర్శనం రూ.300, శీఘ్రదర్శనం రూ.150 చెల్లించాలన్నారు. అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు కేవీపల్లెలో గడప గడపకు మన ప్రభుత్వం

కేవీపల్లె : గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా సోమవారం ఎమ్మెల్యే కేవీపల్లె గ్రామ సచివాలయం–1 పరిధిలో పర్యటిస్తారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ వెంకటరమణారెడ్డి తెలిపారు. సోమవారం ఉదయం 6 గంటల నుంచి వివిధ గ్రామాల్లో పర్యటిస్తారని, మండల స్థాయి అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

సీనియర్ సిటిజెన్స్ సమస్యలపై షార్ట్ ఫిల్మ్



మాట్లాడుతున్న మునిగోపాలకృష్ణ

మదనపల్లె సిటీ: సీనియర్ సిటిజెన్స్ సమస్యలపై త్వరలో షార్ట్ ఫిల్మ్ తీయనున్నట్లు ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్.మునిగోపాలకృష్ణ అన్నారు. ఆదివారం స్థానిక బెంగళూరురోడ్డులోని జీఆర్టీ ఉన్నత పాఠశాలలో సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రముఖ నవలా రచయిత టీఎస్ఏ కృష్ణమూర్తి షార్ట్‌ఫిల్మ్ కథను రచిస్తారన్నారు. వచ్చే నెలలో ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి కరుణాకర్, కోశాధికారి ఉస్మాన్, శకుంతలమ్మ, జగన్, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మట్టి గణపతి.. మనసాస్మరామి..

- పీఓపీ విగ్రహాలతో పర్యావరణానికి ముప్పు
- బంకమట్టితో తయారయ్యే ప్రతిమలే మేలు
- పర్యావరణ పరిరక్షణపై అవగాహన



ఉచితంగా పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉంచిన మట్టి వినాయకుని ప్రతిమలు

మదనపల్లె సిటీ: హిందువుల ముఖ్యమైన పండుగల్లో వినాయకచవితి ఒకటి. ఈనెల 18న వాడవాడలా గణపయ్యలను కొలువుదీర్చి ఉత్సవాలు నిర్వహించనున్నారు. ప్రతిమలను ఆకర్షణీయంగా, భారీ సైజులలో తయారు చేయడానికి ప్లాస్టర్ ఆఫ్ పారిస్ (పీఓపీ) వైపు మొగ్గుచూపుతున్నారు. అయితే పీఓపీతో తయారు చేసిన విగ్రహాలు మట్టి విగ్రహాల్లా కరిగిపోకుండా పర్యావరణానికి అత్యంత ముప్పు తెచ్చి పెడుతున్నాయి. దీంతో పర్యావరణ ప్రేమికులు మట్టి గణపతి ప్రాధాన్యతపై ప్రజలకు తెలియజేస్తున్నారు. ఉచితంగా మట్టి గణపతులను అందిస్తూ పర్యావరణాన్ని కాపాడేందుకు మట్టిమేలు తలపెడదామంటూ పిలుపునిస్తున్నారు. ఈ క్రమంలో మదనపల్లెకు చెందిన కొందరు దాతలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు మట్టి గణపతులను తయారు చేయించి ఉచితంగా అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఎస్ఎస్‌వై యోగా కేంద్రం, హెల్పింగ్‌మైండ్స్, సేదా సంస్థ, లయన్స్‌క్లబ్‌లు ప్రతి ఏటా భక్తులకు ఉచితంగా మట్టి వినాయకుని విగ్రహాలు అందజేస్తున్నారు.

పర్యావరణ పరిరక్షణపై అవగాహన :

వినాయకచవితి వేడుకలను ఇల్లు, వీధి, వాడ, ఊరు అంతటా అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. పర్యావరణ హితమైన మట్టి గణపతుల స్థానంలో హానికరమైన పీఓపీతో తయారు చేసే విగ్రహాలను ఉపయోగిస్తున్నారు. పీఓపీ విగ్రహాలోల బారలోహాలు, మెర్క్యురీ, క్రొమియం, రెడ్ అధికంగా ఉంటాయి. బంకమట్టితో చేసినట్లయితే నీటిలో త్వరగా కరిగిపోతాయి. ఆక్సిజన్ పరిమాణాన్ని తగ్గించే ప్లాస్టర్ ఆఫ్ పారిస్ (పీఓపి)ను వాడడం వల్ల తీవ్ర ముప్పు ఏర్పడుతుంది. తాగునీరు విషతుల్యంగా మారుతోంది. ఈ నీటిని తాగడం వల్ల అనేక వ్యాధులు సక్రమిస్తున్నాయి. నిమజ్జన సమయంలో జరిగే కాలుష్య హాని గురించి అందరూ తెలుసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. నిమజ్జనం నాడు ప్రతిమలతో పాటు ఆకులు,పూలు, పాలథిన్ బ్యాగులు, అద్దకాలు , రంగులు వంటివి కూడా నీటి కాలుష్యంగా మారుస్తాయి. వీటి ప్రభావం వృక్షాలు, జంతులపైనా అధికంగా ఉంటుంది. అందుకే పీఓపీ తయారు చేసే వినాయక విగ్రహాల జోలికి వెళ్లవద్దని అధికారులు, శాస్త్రవేత్తలు, వైద్యులు, పర్యావరణ ప్రేమికులు సూచిచస్తున్నారు.

హాని చేసేవాటిపై మోజు వద్దు



ఎంత పెద్ద విగ్రహం పెట్టి పూజిస్తే అంత గొప్ప అనుకోవడం మానేయాలి. సైజు కన్నా భక్తి ఎక్కువ ఉంటే పర్యావరణం పట్ల కూడా బాద్యత ఉంటుంది. దీనిపై ప్రజలకు అవగాహన కల్పించాలి. మట్టి గణపతులను ఏర్పాటు చేసుకొని పూజించాలి.

-వరప్రసాద్, భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు, మదనపల్లె

మట్టి గణపతులను పూజిద్దాం



పర్యావరణానికి అత్యంత హానికల్గించే పీఓపీ గణపతులను వాడవద్దని చెబుతున్నా వాటినే ఏర్పాటు చేసి పూజిస్తున్నారు. వాటికి బదులుగా ప్రతి ఏడాది ఉచితంగా మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్నాం మట్టి గణపతులను పూజిద్దాం, పర్యావరణాన్ని కాపాడుకుందాం.

-అబూబకర్‌సిద్దిక్, హెల్పింగ్‌మైండ్స్ వ్యవస్థాపకులు, మదనపల్లె

ఆచారాలను గౌరవించాలి



సనాతన ఆచారాలు, వ్యవహారాలు, పర్వదినాలన్నీ శాస్త్రీయ కోణంతో ముడిపడి ఉండేవే. కాకపోతే కాలం తెచ్చిన మార్పులు పర్యావరణానికి తీరని హాని కల్గిస్తున్నాయి. ఇంటింటా సంప్రదాయ రీతిలోనే పండుగ జరగాలన్నదే ఆశయం.

-శివకుమార్‌శర్మ, పండితులు,మదనపల్లె

తాళ్లపాకలో అన్నమయ్య పద నృత్య వైభవం



నృత్య ప్రదర్శనకు హాజరైన వారితో అన్నమాచార్య వంశీయులు

నందలూరు (రాజంపేట) : తాళ్లపాక వంశీయులు స్థాపించబడిన అన్నమయ్య సాంస్కృతిక సేవా సంఘం ఆధ్వర్యంలో పద కవితా పితామహుడు తాళ్లపాక అన్నమాచార్యులు జన్మస్థలమైన తాళ్లపాకలో ఆదివారం వైభవంగా అన్నమయ్య పదనృత్య వైభవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాకారులు నృత్య ప్రదర్శనలు ఇచ్చారు. ఈ సందర్భంగా తిరుమల శ్రీవారి ఆలయం నిత్య హారతి కైంకర్యాదార్ తాళ్లపాక శేషాదర్ రవికుమార్ ఆచార్యులు మాట్లాడుతూ తాళ్లపాక అన్నమాచార్య జన్మస్థలమైన తాళ్లపాకలో అన్నమయ్య పదనృత్య వైభవం నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. అన్నమాచార్య సంకీర్తనలు ప్రపంచ వ్యాప్తంగా విస్తృతం కావాలన్నదే తమ ధ్యేయమన్నారు. కార్యక్రమంలో ప్రొద్దుటూరు నటరాజ కళాక్షేత్రానికి చెందిన మొహిద్దీన్ ఖాన్, కైకలూరు కూచిపూడి ప్రిన్సిపాల్ పసుమర్తి శ్రీవల్లి, హైదరాబాదు నటరాజ్ నృత్య సమితి కె.తరంగిణి, కడప నాట్య కళాభారతికి చెందిన కె.కామేశ్వరి, విశాఖపట్నం మ్యూజిక్ అకాడమీ కళారాధన డ్యాన్సుకు చెందిన తాళ్లపాక సందీప్ కుమార్, రైల్వేకోడూరు కీర్తి డ్యాన్సు అకాడమీకి చెందిన వేంపల్లి హసీనా, రాజంపేట శివా డ్యాన్సు అకాడమీ, మూవీ కొరియోగ్రాఫర్ పెనగలపాటి శివ ప్రసాద్‌లు పాల్గొన్నారు.